క్లుప్తంగా

ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు


ఆలయం వద్ద భక్తుల సందడి

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు గ్రామంలో మంగళవారం గ్రామ దేవత పోలేరమ్మ తల్లికి ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. కుంకుమ బండ్లు, బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. సకాలంలో వర్షాలు పడి గ్రామాలు పాడి పంటలతో పచ్చగా ఉండాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

ఉపాధి హామీ కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

కంభం: ఈనెల 20వ తేదీలోగా ఉపాధి హామీ కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలని ఏపీఓ జీవరత్నం తెలిపారు. మండలంలోని ఎల్‌కోట గ్రామంలో కూలీలకు మంగళవారం అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలో 16,198 మంది ఉపాధి కూలీలకుగాను ఇప్పటి వరకు 6,533 మంది ఈకేవైసీ చేయించుకున్నారని, మిగిలిన వారు స్వగ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. ఈకేవైసీతో బోగస్ మస్టర్లు, బినామీ మస్టర్లను అరికట్టవచ్చని చెప్పారు.

కాలువలో పడిన శునకం


కాలువలో పడిన కుక్కను బయటకు తెస్తున్న గౌస్ మొహిద్దీన్

పొదిలి రూరల్: మండలంలోని మల్లవరం సబ్‌స్టేషన్ సమీపంలో సమ్మర్ స్టోరేజీ నిర్మాణం కోసం తీసిన కాలువలో మంగళవారం ప్రమాదవశాత్తు ఓ కుక్క పడిపోయింది. కాలువ పెద్దదిగా ఉండటం, ఇటీవల పడిన వర్షానికి నీరు చేరి అంచులు జారుతూ ఉండటంతో బయటకు రాలేకపోయింది. కాలువలో పడిన ఆ శునకం పరిస్థితిని చూసి సహచర శునకాలు పెద్ద పెట్టున అరుస్తున్నాయి. అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న షేక్ గౌస్ మొహిద్దీన్ అనే యువకుడు పరిస్థితిని గమనించాడు. స్థానికుల సహాయంతో నిచ్చెన తెప్పించి కాలువలో దిగి శునకాన్ని బయటకు తీసుకువచ్చాడు. గౌస్ మొహిద్దీన్ సేవా గుణాన్ని స్థానికులు అభినందించారు.

స్కూల్ గేమ్స్‌లో తురిమెళ్ల విద్యార్థి సత్తా


డిస్కస్ త్రో చేస్తున్న మహేష్

కంభం: సింగరాయకొండలో మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్-19 డిస్కస్ త్రోలో తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి టి.మహేష్ ద్వితీయ బహుమతి, 800 మీటర్ల పరుగు పందెంలో తృతీయ బహుమతి సాధించి సత్తా చాటాడు. ఈ సందర్భంగా ఆ విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోనీ, అధ్యాపకులు అభినందించారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు


యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై నరసింహారావు

కంభం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై నరసింహారావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక అర్థవీడు రోడ్డులోని పలు ప్రాంతాలను సిబ్బందితో కలిసి ఆయన తనిఖీ చేశారు. బహిరంగ ప్రదేశాల్లో పడేసిన మద్యం సీసాలను గుర్తించి పరిసరాలను శుభ్రం చేయించారు. మద్యం తాగుతూ పట్టుబడిన యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి యజ్ఞం


గాయత్రి యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

గిద్దలూరు రూరల్: పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని గాయత్రిమాత ఆలయం ఆవరణలో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో మంగళవారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామకృష్ణ ధ్యాన మందిరం ప్రధాన కార్యదర్శి పి.హనుమంతారెడ్డి మాట్లాడుతూ.. లోక కల్యాణం కోసం గాయత్రి యజ్ఞం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. భక్తులకు అన్న సంతర్పణ చేశారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అటు ఆంక్షలు.. ఇటు అధిక ధరలు!

- సగిలేరులో ఎర్ర ఇసుక తెచ్చుకోలేక స్థానికుల తంటాలు
- అసెంబ్లీ సాక్షిగా సీఎం హామీ ఇచ్చినా అవరోధాలు
- 5 టన్నుల ట్రక్కు తెల్ల ఇసుక ధర రూ.7 వేలు
- గత ప్రభుత్వంలో కంటే ట్రక్కుపై రూ.3 వేలు అధిక ధర


ఉచిత ఇసుకపై వినతి పత్రాన్ని అందజేస్తున్న సీఐటీయు నాయకులు(ఫైల్)

గిద్దలూరు రూరల్:

అమ్మా పెట్టదు.. అడుక్కు తిననివ్వదన్న చందంగా ఉంది గిద్దలూరులో భవన నిర్మాణదారుల పరిస్థితి. భవనాల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ఉచితంగా ఇస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చాక నాలుక మడతేసిన సంగతి తెలిసిందే. ఇసుక ఉచితం అనే మాట పక్కన బెడితే.. అదే ఇసుకను అడ్డుపెట్టుకుని కూటమి ముఖ్యనేతలు దందాకు తెరలేపారు. స్థానికంగా వాగుల్లో లభ్యమయ్యే ఇసుకను ఉచితంగా తీసుకోవచ్చని అసెంబ్లీ సాక్షిగా సీఎం చంద్రబాబు ప్రకటించినా క్షేత్ర స్థాయిలో మాత్రం అలాంటి పరిస్థితి లేకుండాపోయింది.

గిద్దలూరు మండలంలోని కె.ఎస్.పల్లె, దిగువమెట్ట తండా, దిగువమెట్ట, ఉయ్యాలవాడ, సూరేపల్లె, గడికోట, కొంగలవీడు, ఎగ్గన్నపల్లె ప్రాంతాల మీదుగా ప్రవహించే సగిలేరు రివర్ బేసిన్‌లో ఎర్ర ఇసుక లభ్యమవుతుంది. దీనిని స్థానిక గ్రామాల్లోని భవన నిర్మాణదారులు కొంతమేర వినియోగించుకునే వారు. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. సగిలేరులో మేటలు వేసిన ఇసుకను తెచ్చుకునేందుకు వెళ్లిన వారిని అధికారులు కట్టడి చేస్తుండటంతో ఆ ఛాయలకు వెళ్లేందుకు జంకుతున్నారు. చిన్నపాటి పనులకు 10, 20 గోలాల ఇసుక కావాల్సిన వారు సైతం తెల్ల ఇసుకను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ట్రక్కు రూ.7 వేలా?

టీడీపీ నాయకులు ఎడవల్లి క్రాస్ రోడ్డు వద్ద తెల్ల ఇసుకను పెద్ద ఎత్తున డంపింగ్ చేసి టన్ను రూ.1200 చొప్పున విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ పరిమాణం 5 టన్నులు కాగా బాడుగతో కలిసి లబ్ధిదారుడి ఇంటికి చేరే సరికి రూ.7 వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఆర్థిక భారం పెరిగిపోతోందని భవన నిర్మాణదారులు గగ్గోలు పెడుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ట్రక్కు ఇసుక రూ.4 వేలకు లోపే లభించేదని, ప్రస్తుతం అదనంగా ఖర్చు చేయాల్సి వస్తోందని చెబుతున్నారు. ఉచిత ఇసుక హామీని కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా నిలబెట్టుకోవాలని, స్థానికంగా లభ్యమయ్యే ఎర్ర ఇసుక తెచ్చుకునే వెసులుబాటు కల్పించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


చిన్నపాటి పనులకు సైతం తెల్ల ఇసుకను వాడుతున్న దృశ్యం

ఎర్ర ఇసుక అందుబాటులోకి తీసుకురావాలి



పేదలకు తక్కువ ధరకు లభించే ఎర్ర ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. చిన్న చిన్న పనులు చేయించుకునే వారికి స్థానికంగా ఉండే వాగుల్లో లభించే ఎర్ర ఇసుక వల్ల పూర్తిగా ఖర్చులు తగ్గుతాయి. ఎర్ర ఇసుకను అడ్డుకోవడం చాలా దారుణం.

– నారాయణ, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు

ఉచిత ఇసుక ఎక్కడ అమలవుతోంది



ఎన్నికలకు ముందు చంద్రబాబు ఉచిత ఇసుక హామీ ఇచ్చారు. సీఎం అయ్యాక ఎక్కడ అమలు చేస్తున్నారు. గత ప్రభుత్వం కంటే కూటమి ప్రభుత్వంలోనే అధిక ధరలకు ఇసుక విక్రయిస్తున్నారు. ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ.7 వేలు పెట్టి కొనలేక భవన నిర్మాణదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇసుకతో ఇబ్బందయ్యి పనులు నిలిచి పోవడంతో కార్మికుల ఉపాధి పోతోంది.

– ఆవులయ్య, సీఐటీయూ నాయకుడు

రాష్ట్ర స్థాయి స్కేటింగ్‌కు హేమంత్ ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థి జంగం హేమంత్ కుమార్ స్కేటింగ్‌లో అండర్-14 విభాగంలో సత్తాచాటాడు. ఇటీవల అద్దంకిలో జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా విద్యార్థితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు మోడి రాజశేఖర్‌ను హెచ్‌ఎం బొల్లా పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు.

డీజేలకు అనుమతి లేదు

పొదిలి/గిద్దలూరు రూరల్: ఉత్సవాల సమయంలో డీజే బాక్సులు వాడరాదని పొదిలి సీఐ వెంకటేశ్వర్లు, గిద్దలూరు సీఐ కె.సురేష్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో స్పష్టం చేశారు. మైకుకు అనుమతి తీసుకుని ఎక్కువ శబ్దం వచ్చే డీజే బాక్సులు పెడుతుండటంతో గుండె జబ్బులు ఉన్నవారికి ప్రాణ సంకటంగా మారుతోందని పేర్కొన్నారు. డీజే బాక్సులపై నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాల్మీకి జీవితం లోకానికి ఆదర్శం


మార్కాపురంలో వాల్మీకి మహర్షి విగ్రహానికి పూజలు చేస్తున్న నిర్వాహకులు


అర్ధవీడు : బొల్లుపల్లిలో వాల్మీకి చిత్రపటం ఊరేగింపు

మార్కాపురం: మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం మార్కాపురం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తర్లుపాడు రోడ్డులోని కరెంట్ ఆఫీసు వద్ద ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. రామాయణం మహాకావ్యాన్ని ప్రపంచానికి అందించిన వాల్మీకి మహర్షి జీవితం లోకానికే ఆదర్శమని వాల్మీకి సంఘం పెద్దలు భూపని కాశయ్య, మండ్ల రామాంజనేయులు పేర్కొన్నారు. వాల్మీకి మహర్షి జయంతిని సెలవు రోజుగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వాల్మీకులను ప్రభుత్వం ఎస్టీలుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో బోగెం కాటంరాజు, నల్లబోతుల కొండయ్య, అచ్చయ్య, శ్రీనివాసరావు, మల్లికార్జున, పోలయ్య, మండ్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె బీసీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయంలో వాల్మీకి విగ్రహానికి భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాల్మీకి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని నిర్వాహకుడు శ్రీను పేర్కొన్నారు. అలాగే స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అర్ధవీడు: మండల పరిధిలోని బొల్లుపల్లి గ్రామంలో వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జన్మదినం సందర్భంగా గ్రామ ప్రజలు భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై వాల్మీకి చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు.

కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలి


సీహెచ్‌వోకు వినతి పత్రం అందిస్తున్న ఆశాలు

తర్లుపాడు: కనీస వేతనం రూ.26 వేలకు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు మంగళవారం తర్లుపాడులో నిరసన కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. చిరుద్యోగులమైన తమకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని 5జీ మొబైల్స్ అందించాలని, మీటింగ్‌ల కోసం పీహెచ్‌సీకి వచ్చిన సందర్భాల్లో టీఏ, డీఏలు మంజూరు చేయాలని కోరారు. అర్హత కలిగిన వారికి ఏఎన్‌ఎం, జీఎన్‌ఎంలుగా ప్రమోషన్లు కల్పించడంతో పాటు క్యాజువల్ లీవ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మాజీ నాయకులు బాలనాగయ్య మాట్లాడుతూ ఆశాలకు పనిభారం తగ్గించాలని కోరారు. వెంటనే తమ డిమాండ్లు అమలు చేయాలని యూనియన్ నాయకులు బాలమ్మ, బాలనాగయ్య ఆధ్వర్యంలో సీహెచ్‌ఓకి వినతి పత్రం అందించారు. యూనియన్ నాయకులు పుల్లమ్మ, ఆదిలక్ష్మి, పద్మ, ముంతాజ్, నాగమ్మ పాల్గొన్నారు.

పొదిలిలో పోలీసుల విస్తృత తనిఖీలు


ఆర్టీసీ బస్టాండ్ పార్సిల్ ఆఫీస్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

పొదిలి: గంజాయి కట్టడి లక్ష్యంగా పోలీసులు మంగళవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వేమన ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో దుకాణాలు, పార్సిల్ ఆఫీస్, బెస్తపాలెంలో అనుమానితుల గృహాల్లో సోదాలు నిర్వహించారు. గంజాయిని పసిగట్టడంలో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీస్ జాగిలం రాక్సీని తనిఖీలకు వినియోగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు, వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, 112కు డయల్ చేయాలని కోరారు.

మత్తుతో జీవితాలను చిత్తు చేసుకోవద్దు

మత్తు పదార్థాల వాడకం ద్వారా జీవితాలు చిత్తవుతాయని, మత్తు పదార్థాలు సరఫరా చేసే వారికి, కలిగి ఉన్న వారికి ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం శిక్షలు కఠినంగా ఉంటాయని సీఐ వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం స్థానిక సెయింట్ మేరీస్ డీఎడ్ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో సీఐ మాట్లాడారు.

వెలుగొండ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కేపీ పూజలు


ఆలయంలో కేపీని సన్మానిస్తున్న ఆలయ చైర్మన్

కొనకనమిట్ల: ప్రముఖ పుణ్యక్షేత్రం వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు కేపీతో అభిషేకాలు, అర్చనలు చేయించారు. అనంతరం కేపీ కొండారెడ్డిని ఆలయ కమిటీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశ్చిమ ప్రాంత ప్రజలకు ఎల్లప్పుడూ వెలుగొండ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని పూజలు చేసినట్లు తెలిపారు. రాబోవు రోజుల్లో వైఎస్సార్ సీపీకి మంచి రోజులు వస్తాయని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, రాజన్న పాలన మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం



రాచర్ల బస్టాండ్ సెంటర్‌లో మూతపడిన ఏటీఎం

రాచర్ల: మండల కేంద్రమైన రాచర్ల బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ ఏటీఎం మూతపడటంతో ఖాతాదారులు అవస్థలు పడుతున్నారు. గడిచిన పది రోజులుగా ఏటీఎం పనిచేయకపోవడంతో డబ్బు డ్రా చేయడానికి గిద్దలూరు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన బ్యాంకు అధికారులు చర్యలు తీసుకుని ఏటీఎంను వినియోగంలోకి తీసుకురావాలని ఖాతాదారులు కోరుతున్నారు.

ఆరుగురు జూదరులు అరెస్టు

రాచర్ల: మండలంలోని పలుగుంటిపల్లె గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో పేకాట శిబిరంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.13,450 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

చినుకు పడితే చిత్తడే.. అడుగేస్తే జారుడే!


చిత్తడిగా మారిన గొంటువానిపల్లి దారి


బాపతుపల్లిలో ఓ వీధిలో ఇలా..


ఇరసలగుండం వెళ్లే దారిలో నిలిచిన వర్షం నీరు

కొనకనమిట్ల: గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. చిరుజల్లులకే చిత్తడిగా మారుతున్న రోడ్లు.. ఓ మోస్తరు వర్షానికి తటాకాలను తలపిస్తున్నాయి. కొనకనమిట్ల మండలంలోని పెదారికట్ల పంచాయతీ పరిధిలోగల గొంటువానిపల్లి, బాపతుపల్లిలోని అంతర్గత రహదారులు సోమవారం రాత్రి కురిసిన వర్షానికి బురదమయంగా మారి నడిచేందుకు వీల్లేని పరిస్థితి దాపురించింది. పెదారికట్ల బస్టాండ్ నుంచి ఇరసలగుండం వెళ్లే రోడ్డులో వర్షం నీరు నిల్వ ఉండటంతో అటుగా వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పాఠశాలకు వెళ్లే పిల్లలు దారి అంచుల వెంట వెళ్లలేక రోజూ తంటాలు పడుతున్నారు. వీధుల్లో వర్షం నీరు నిల్వ ఉండటం, దోమలు వ్యాప్తి చెందడం, దుర్వాసన వస్తుండటంతో రోగాలు ప్రబలుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి వీధులను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సీజేఐపై దాడి గర్హనీయం


విధులను బహిష్కరించి నిరసన తెలియజేస్తున్న న్యాయవాదులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కోర్టు ఆవరణలో గిద్దలూరు బార్ అసోషియేషన్ సభ్యులు మంగళవారం విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్‌అసోషియేషన్ అధ్యక్షుడు పి.శేషశయనారెడ్డి మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయవాది రాకేష్ కిషోర్ అవమానకరంగా ప్రవర్తించడం భావ్యం కాదని పేర్కొన్నారు. కోర్టులో పవిత్రమైన స్థానంలో కూర్చున్న న్యాయమూర్తిపై షూ విసరడం సరైన పద్ధతి కాదన్నారు. న్యాయవాదులు సమన్వయం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హిమశేఖరరెడ్డి, అహల్య, సంగీతరావు, రాజశేఖరరెడ్డి, రాజ్‌కుమార్‌నాయక్, పోలిరెడ్డి,యాషిన్‌భాష, తిరుమల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో మానసిక ఆరోగ్య వారోత్సవాలు

తర్లుపాడు: మండలంలోని కలుజువ్వలపాడు కేజీబీవీలో ప్రపంచ మానసిక ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మానసిక ఆరోగ్యం-హెల్త్ డైట్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మానసిక నిపుణురాలు కె.పద్మావతి పాల్గొని ఆరోగ్యంపై బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మానసికంగా దృఢంగా ఉండటం గురించి వివరించారు. కమ్యూనికేషన్, టెక్నాలజీపై మెళకువలు తెలిపారు. ప్రిన్సిపాల్ మారుతిదేవి, కేజీబీవీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ వ్యర్థాలతో ముసి వాగు కలుషితం


ముసి వాగులో పేరుకుపోయిన సిల్ట్

పొదిలి రూరల్: గ్రానైట్ పరిశ్రమల నుంచి వచ్చే వ్యర్థాలను ముసి వాగులో కలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని పొదిలి మండలం ఏలూరు గ్రామానికి చెందిన మూలంరెడ్డి సుబ్బారెడ్డి అధికారులకు విన్నవించారు. ఏలూరు పంచాయతీలో ఉన్న గ్రానైట్‌లో పరిశ్రమలో ఉత్పన్నమైన వ్యర్థాలను టిప్పర్ల సాయంతో ముసిలో ఖాళీగా ఉన్న ప్రాంతంలో వదిలి వెళ్తుండటంతో నీరు కలుషితమవుతున్నాయని వివరించారు. దీనిపై స్పందించిన అధికారులు ముసిలో వ్యర్థాలు తొలగించాలని ఈ నెల 4న నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లోగా ముసిలో సిల్ట్ తొలగించకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)

Office mail : sakshiongads@gmail.com